సాక్షి ఒడిశా

శనివారం | 3 | మే | 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 4,72,876
బంగారం : 4 గ్రాముల 700 మిల్లీ గ్రాములు
వెండి : 16 గ్రాముల 100 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



సామూహిక ఉపనయనాలు
జయపురంలో సామూహిక ఉపనయనాలు జరిగాయి. శైవులకు, వైష్ణవులకు కలిపి క్రతువు జరిగింది. - 10లో



కిట్ విద్యార్థిని మరణం
కిట్ వర్సిటీ విద్యార్థిని చనిపోయింది. ఇది కలకలం రేపింది. - 10లో

న్యూస్‌రీల్

10న కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటన



భువనేశ్వర్: కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెండు రోజుల రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. ఈనెల 10న భువనేశ్వర్ చేరుకుంటారు. తొలి పర్యటనలో జట్నీ సందర్శిస్తారు. ఈ సందర్భంగా ఫోరెన్సిక్ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేసి సాయంత్రం పూరీలో పర్యటిస్తారు. శ్రీమందిరంలో శ్రీజగన్నాథుని దర్శించుకుని పూజాదుల్లో పాల్గొంటారు. ఆ రాత్రి పూరీలో బస చేస్తారు. మరుసటి రోజు పశ్చిమ ఒడిశా సందర్శిస్తారు. సంబలపూర్ ప్రాంతంలో మా సమలేశ్వరి మాత ఆలయం సందర్శించి ప్రార్థనల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా కొన్ని అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం భువనేశ్వర్ జనతా మైదాన్‌లో జరిగే బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రసంగిస్తారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ తెలిపారు.

రాధాకృష్ణ దేవాలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్

కొరాపుట్: రాధాకృష్ణ దేవాలయ నిర్మాణానికి భూమి పూజ జరిగింది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని నీలకంఠ నగర్–ఇచ్ఛావతి గుడల మధ్య నూతనంగా నిర్మించనున్న ఆలయ పనులకు నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి శుక్రవారం భూమి పూజ చేశారు. వేద పండితుల సమక్షంలో మట్టిని పోసి తొలి క్రతువు ముగించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ కను దాస్ పాల్గొన్నారు.

తాగునీటి బాటిళ్లలో నాటుసారా



స్వాధీనం చేసుకున్న సారాతో ఉన్న వాటర్

భువనేశ్వర్: మినరల్ వాటర్ బాటిళ్లలో నాటుసారా అమ్మకం గుట్టు రట్టయ్యింది. ఖుర్దా జిల్లా భువనేశ్వర్ శివారు దారుతెంగో ప్రాంతంలో ఈ వ్యవహారం బట్టబయలైంది. ఆకస్మిక దాడుల్లో అబ్కారీ విభాగం పోలీసులు 10,000 లీటర్ల నాటుసారాతో మినరల్ వాటర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి మార్కెట్ విలువ సుమారు రూ.19 లక్షలుగా పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి మూడు నాలుగు చక్రాల వాహనాలు, 2 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

దంపతుల ఆత్మహత్య

రాయగడ: ఇద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. అందుకు పెద్దలు కూడా అంగీకరించారు. వారి దాంపత్య జీవితం సంతోషంగా కొనసాగుతుండేది. అయితే ఏ కష్టమొచ్చిందో గానీ ఇద్దరూ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అత్యంత విషాదకరమైన ఈ ఘటన జిల్లాలోని చంద్రపూర్ సమితి లక్ష్మీపూర్ గ్రామంలో గల నువాసాహిలో శుక్రవారం చోటు చేసుకుంది. మృతులను కేదార్ కుసులియా (32), శ్రీయా బొడొనాయక్ (27) లుగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న బిసంకటక్ ఎస్‌డీపీఓ సంతోషిణి ఓరం సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. బిసంకటక్ పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు.

విజిలెన్స్ వలలో దశమంతపూర్ సీడీపీఓ



దశమంత్‌పూర్ సీడీపీఓ శకుంతల

కొరాపుట్: విజిలెన్స్ వలకు అవినీతి సీడీపీఓ చిక్కారు. శుక్రవారం కొరాపుట్ జిల్లా దశమంతపూర్ సీడీపీఓ శకుంతల దాస్ రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా అరెస్టయ్యారు. అదముండా గ్రామ అంగన్‌వాడీ వర్కర్ మినతి ఖోస్లా విధి నిర్వహణ పత్రాలు ఆమోదించడానికి రూ.10 వేలు డిమాండ్ చేశారు. అంత డబ్బులు ఇవ్వలేని మినతి జయపూర్ విజిలెన్స్ కార్యాలయాన్ని సంప్రదించారు. దీంతో వారు వల వేసి సీడీపీఓను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తదుపరి విచారణ కోసం జయపూర్ విజిలెన్స్ కార్యాలయానికి తరలిస్తున్నారు.

22 బైక్‌ల స్వాధీనం

- బైక్ దొంగల గుట్టు రట్టు
- నలుగురు నిందితుల అరెస్టు



పట్టుబడిన బైక్‌లు



పట్టుబడిన బైక్ దొంగలు



బైక్ దొంగతనాల గురించి వివరిస్తున్న ఎస్‌డీపీఓ పార్థ పార్థ జగదీస్ కాశ్యప్, తదితర పోలీసు అధికారులు

జయపురం: ఒక బైక్ దొంగతనం కేసును దర్యాప్తు చేస్తే మొత్తం బైక్ దొంగల గుట్టు రట్టయ్యింది. జయపురం పట్టణ పోలీసులకు అందిన ఒక కేసు దర్యాప్తు జరపగా అనేక బైక్ దొంగతనం కేసులు బయట పడ్డాయి. జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి పార్థ జగదీస్ కాశ్యప్ శుక్రవారం మధ్యాహ్నం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. గత నెల 27న జయపురం సొరసాహి వాసి కార్తీక మహాపాత్రో(19) తన బైక్ పోయిందని ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఆ మేరకు దర్యాప్తు ప్రారంభించామని దర్యాప్తులో నరసింగ ఉరఫ్ నరేష్ దవురుని అదుపులోకి తీసుకుని విచారణ చేశామని తెలిపారు. అయితే తాను ఒక్కడినే కాదని, తనతో బొరిగుమ్మ సమితి బొడొదుబులి గ్రామ వాసి అనిల్ హరిజన్(33) కూడా ఉన్నాడని బయట పెట్టాడని పేర్కొన్నారు. ఇద్దరూ కలిసి దొంగిలించిన బైక్‌లు అన్నీ నవరంగపూర్ జిల్లా మైదల్‌పూర్ డెంగా సాహి లక్ష్మణ హరిజన్(50) ఇంటిలో ఉంచామని వెల్లడించినట్లు పోలీసు అధికారి తెలిపారు. అనంతరం దొంగిలించిన మోటారు 22 బైక్‌లు అన్నీ లక్ష్మణ మరియు, భీమ ఖిలోల ద్వారా మల్కన్‌గిరి, కొరాపుట్, నవరంగపూర్ జిల్లాల మారుమూల ప్రాంతాల్లో రూ.10వేలు, రూ.15వేలకు అమ్మేసినట్లు తెలిపారని పేర్కొన్నారు. ఆ బైక్‌లన్నీ లక్ష్మణ్, భీమ ఖిలోల ద్వారా రికవరీ చేసినట్లు వెల్లడించారు.

నిందితుడు అనిల్ హరిజన్ దొంగిలించిన మోటారు బైక్‌లను మైదల్‌పూర్ లక్ష్మణ ఇంటి సమీపంలో చేర్చి ఒక్కో కస్టమర్‌ను ఏర్పాటు చేసి వారికి అమ్ముతున్నట్లు వెల్లడించారు. బైక్ దొంగతనంలో ఆరితేరిన అనిల్ హరిజన్‌ను గతంలో బొరిగుమ్మ పోలీసులు అరెస్టు చేశారని, అప్పట్లో అతడి నుంచి 15 బైక్‌లు రికవరీ చేశారని పోలీసు అధికారి కాశ్యప్ వెల్లడించారు. రెండు నెలల కిందటే అనిల్ బెయిల్‌పై విడుదలయ్యాడని తెలిపారు. అతడు జయపురం పట్టణం, జయపూర్ సదర్, అంపాణి, బొరిగుమ్మ, బొయిపరిగుడ, రాయిఘర్, నవరంగపూర్, సునాబెడ, మొదలగు పోలీసు స్టేషన్ల పరిధిలో బైక్ దొంగతనాలు చేశాడని వెల్లడించారు. గురువారం సాయంత్రం వారిని అరెస్టు చేసి శుక్రవారం హాజరు పరిచామని చెప్పారు. ఇంకొన్ని బైక్‌ల వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

బైక్‌ల అప్పగింత

జయపురం: వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో దొంగలు దొంగిలించిన బైక్‌లను బైక్‌ల యజమానులకు జయపురం పోలీసు అధికారు శుక్రవారం అప్పగించారు. జయపురం పట్టణ పోలీసులు 22 బైక్‌లను నిందితుల నుంచి స్వాధీన పరుచుకున్నారు. వాటిని జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి పార్థ జగదీష్ కాశ్యప్, పట్టణ పోలీసు అధికారి అశివిణీ కుమార్ పట్నాయిక్ తదితరుల సమక్షంలో యజమానులకు అప్పగించారు.



పోయిన బైక్‌లు పొందిన యజమానులు

రైతులు ధాన్యం డబ్బులు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న బీజేడీ నాయకులు

కొరాపుట్: రాయిఘర్ ప్రాంతంలోని రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు చెల్లించాలని బీజేడీ మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి డిమాండ్ చేశారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని రాకీసాన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలోని సుమారు 144 మంది రైతుల వద్ద ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. మూడు నెలలు అయినా వారికి డబ్బులు చెల్లించలేదని పేర్కొన్నారు. అనంతరం బీజేడీ నేతలు నేరుగా సీఎస్‌వో ఆఫీస్‌కి వెళ్లి ధర్నా చేపట్టారు. వెంటనే అధికారులు స్పందించి మరో 15 రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఆందోళనలో డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రందారి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ మంజులా మజ్జి, మాజీ ఎమ్మెల్యే సుభాష్ గొండో తదితరులు పాల్గొన్నారు.

మజ్జిక పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక రాజవీధిలో రవి నర్సింగ్ హోమ్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం మజ్జికను బాటసారులకు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని డాక్టర్ ఆర్.ఆర్.రవి, డాక్టర్ పి.ఉషా ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. పేద ప్రజలకు నెలసరి రేషన్ కూడా డాక్టర్ ఆర్.ఆర్.రవి దంపతులు అందజేస్తున్నట్లు తెలియజేశారు.

కోపరేషన్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ పర్యటన



భారత మాల ప్రాజెక్ట్ వద్ద రాజేష్ పాటీల్ బృందం

కొరాపుట్: రాష్ట్ర కోపరేషన్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ, కొరాపుట్ జిల్లా నోడల్ అధికారి రాజేష్ ప్రభాకర్ పాటీల్ కొరాపుట్ జిల్లాలో శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఆరు అంచెల ఎకనామిక్ కారిడర్ భారత మాల రోడ్డు నిర్మాణంలో భాగంగా పర్వత టన్నెల్ సందర్శించారు. అతి పెద్ద వాటర్ సప్లై ప్రాజెక్ట్, రాజపుట్‌లో మిలిట్ ప్రోసెసింగ్ సెంటర్, పెట్టెరులో రూరల్ ఇండస్ట్రీయల్ పార్క్‌లను సందర్శించి వాటి పురోగతిని సమీక్షించారు. గతంలో ఈ ప్రాంతంలో కలెక్టర్‌గా పనిచేయడంతో రాజేష్ రాకతో అధికారుల్లో ఉత్కంఠ నెలకొంది. పలు చోట్ల ప్రజలు వినతులు ఇచ్చారు. పర్యటనలో జయపూర్ సబ్ కలెక్టర్ అక్కవరం సశ్యా రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు ఉన్నారు.



రూరల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో అధికారుల పర్యటన

40 ఫోన్ల రికవరీ

కొరాపుట్: పోగొట్టుకున్న 40 మొబైల్స్ ఫోన్లను పోలీసులు తిరిగి యజమానులకు అప్పగించారు. శుక్రవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మిహిర్ పండా విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో సుమారు 40 మంది తమ ఫోన్లను పోగొట్టుకున్నారని, అవి చాలా మంది చేతులు మారాయన్నారు. వీటిని కనిపెట్టి స్వాధీనం చేసుకున్నామన్నారు. తిరిగి వాటిని యజమానులకు అప్పగించామని ఎస్పీ ప్రకటించారు. ఇందులో ఆశ్చర్యకర విషయం ఏమిటంటే ఫోన్లు పొందిన కొంత మంది తమ ఫోన్లు పోయినట్లు పోలీసు ఫిర్యాదులు కూడా చేయలేదు. కానీ పోలీసులు వివిధ నేరస్తుల వద్ద స్వాధీనం చేసుకున్న ఫోన్లపై విచారణ చేసి యజమానుల పేర్లు కనిపెట్టి మరీ వారి అందజేశారు.



సెల్‌ఫోన్లు అందుకున్న ఆనందంలో యజమానులు

ఘనంగా సాహిత్య సంసద్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న ముఖ్యఅతిథి



సావినీర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

జయపురం: ఛండనొయి సాహిత్య సంసద జయపురం శాఖ వార్షికోత్సవం స్థానిక లోకేశ్వరి కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో శుగ్రవారం ఘనగా జరిగింది. ఉత్సవంలో ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ సురేష్ దాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. శ్రీజగన్నాథుని చిత్రపటానికి పూల మాలలు వేసి పూజించిన తరువాత ఛిండినొయి సాహత్య సంసద్ కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు యుధిస్టర్ మల్లిక్ అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవంలో ముఖ్యవక్తగా ఆదివాసీ భాష పరిశోధకులు డాక్టర్ రాజేంద్రపాఢీ, గౌరవ అతిథిగా అధ్యాపకులు డాక్టర్ సుధాంశు శేఖర పట్నాయక్ హాజరై సమాజాన్ని చైతన్య పరచటంలో సాహిత్య ప్రభావాన్ని వివరించారు. ఛిండినొయి సాహత్య సంసద్ వార్షికోత్సవం ముఖపత్రం శుభశ్రీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఔత్సాహిక రచయితలు నేటి సమాజ పరివర్తనలో సాహిత్య భూమికపై చర్చించారు. చర్చలలో భైరాగి చరణ సాహు, విజయ లక్ష్మి పాణిగ్రహి, ప్రమోద్ కుమార్ రాఠొ, అశోక్ పొలాయ్, భావ చంద్రికా దేవి, అజయ మల్లిక్, డోలి నాయిక్, నారాయణ సాగర్, ఘాశీరాం మహాపాత్రో, శుభశ్రీ పట్నాయక్, రాజశ్రీస్వైు, అభిలాష్ శాంత పాత్రో, శుభశ్రీ పాత్రో, సంఘమిత్ర భక్త పాల్గొన్నారు. ప్రముఖ కవులు, కవియిత్రిలు తమ శ్వీయ రచనలను వినిపించారు. నిరంజన్ పాణిగ్రహి, సంతోష్ నాయిక్, నికుంజ రంజనీ మహంతి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సామూహిక ఉపనయనాలు



కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఉపనయనాలు జరుగుతున్న దృశ్యం

కొరాపుట్: కళింగ వైశ్య యువకుల సామూహిక ఉపనయనాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. జయపూర్ మహారాణిపేటలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో ఉపనయన కార్యక్రమం శుక్రవారం మెదలయింది. దీక్ష పొందే యువకులు ర్యాలీగా వెళ్లి కొజిరియా బందు (చెరువు) నుంచి పవిత్ర జలాలను తీసుకొని వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 111 మంది యువకులు దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మూడు రోజులు జరగనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని లుకలాం గ్రామానికి చెందిన గుండుగోల సూర్య ప్రసాద్ శర్మ, శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు ఉపనయన దీక్షలకు నేతృత్వం వహించారు. ఈ నెల నాలుగో తేదీన ఉపనయనాలు ముగియనున్నాయి.



వేదపండితులు సూర్య ప్రసాద్ శర్మ, శ్రీనివాసచార్యులు

గజపతి టాప్.. కొరాపుట్ లాస్ట్

- మెట్రిక్ పరీక్ష ఫలితాలు వెల్లడి
- సమగ్ర ఉత్తీర్ణత 94.93 శాతం



గ్రేడ్‌ల వారీగా ఉత్తీర్ణత వివరాలు	
ఏ1	- 1,812
ఏ2	- 12,200
బి1	- 38,831
బి2	- 84,971
సి	- 1,33,822

భువనేశ్వర్: రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు నిర్వహించిన పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాలు శుక్రవారం వెల్లడించారు. ఈ ఏడాది ఫలితాల్లో 94.93 శాతం సమగ్ర ఉత్తీర్ణత నమోదైంది. పరీక్షలు రాసిన 5 లక్షల 2 వేల 417 మంది విద్యార్థుల్లో 4 లక్షల 84 వేల 863 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతలో బాలికలదే పైచేయిగా నిలిచారు. బాలికల ఉత్తీర్ణత 96 శాతం నమోదు కాగా బాలుర ఉత్తీర్ణత 94 శాతానికి పరిమితమైంది. అత్యధికంగా 99.35 శాతం ఉత్తీర్ణతతో గజపతి జిల్లా అగ్ర స్థానంలో నిలిచింది. అత్యల్పంగా 92.83 శాతం ఉత్తీర్ణతతో కొరాపుట్ జిల్లా అట్టడుగుకు దిగజారింది. రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యా విభాగం మంత్రి నిత్యానంద గోండ్ బోర్డు కార్యాలయం సందర్శించి ఫలితాల్ని ప్రకటించారు. ఆయనతో విభాగం ప్రముఖ కార్యదర్శి షాలిని పండిట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫలితాల సంచికని ఆవిష్కరించారు.

సాయంత్రం 6 గంటల నుంచి ఫలితాలు bsodisha.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఓఆర్10 అని టైప్ చేసి 5676750 కు ఎస్‌ఎంఎస్ చేస్తే ఫలితాలు వివరాలు అందుతాయన్నారు. పరీక్ష ఫలితాల్లో 3,273 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. గత ఏడాది పదో తరగతి ఉత్తీర్ణత రేటు 96.27 శాతం నమోదైంది.

ముఖ్యమంత్రి అభినందనలు

బోర్డు వార్షిక పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అభినందించారు. ఆశాజనకమైన ఫలితాలు సాధించలేకపోయిన విద్యార్థులు దృఢ సంకల్పంతో సాధన చేసి ముందుకు సాగాలని ముఖ్యమంత్రి ప్రోత్సహించారు. విద్యార్థులంతా ఉజ్వల భవిష్యత్‌తో ఉన్నత ఫలితాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

భారీ విమానయాన ప్రణాళికల ఆవిష్కరణ

- కొత్త గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం
- 15 జిల్లాల్లో హెలీపోర్ట్‌లు



భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రామాణికలతో కూడిన భారీ విమానయాన ప్రణాళికని ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో పారాదీప్‌లో కొత్త గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, 15 జిల్లాల్లో హెలీపోర్ట్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర విమానయాన మౌలిక సదుపాయాలను పెంపొందించే దిశలో ఇదో కీలకమైన అడుగు. స్థానిక లోక్ సేవా భవన్‌లో జరిగిన కీలక సమావేశంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి రాష్ట్ర విమానాశ్రయాలు ఆధునీకరణ, విస్తరణకు ప్రాధాన్యతనిస్తూ ప్రపంచ ప్రామాణికలు లక్ష్యంగా కృషి చేయాలని ముఖ్యమంత్రి ప్రోత్సహించారు. పారదీప్ ప్రాంతంలో విమానయాన సామర్థ్యాలను పెంచే లక్ష్యంతో కొత్త గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్మించే ప్రణాళికలను ఆవిష్కరించింది.

పూరీ విమానాశ్రయ సన్నాహాలు వేగవంతం

పూరీలోని శ్రీ జగన్నాథ్ విమానాశ్రయాన్ని వేగంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. విమాన రాకపోకలకు ఆదరణ పెరుగుతున్నందున విమానయాన అనుసంధానం ప్రాధాన్యత సంతరించుకుంది. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులు, సందర్శకుల రాకపోకలతో నిత్యం కిటకిటలాడే పూరీ ప్రాంతంలో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాధాన్యతని ఉన్నత స్థాయి సమావేశంలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో వైమానిక ప్రయాణ సౌకర్యాలు పెంపొందించడానికి విస్తృత వ్యూహాన్ని ప్రతిబింబిస్తూ 15 జిల్లాల్లో హెలిపోర్ట్‌లను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నట్లు ఈ సమావేశంలో ప్రస్తావించారు.

హెలిపోర్ట్‌లు, విమానయాన కేంద్రాల అభివృద్ధి

ప్రాంతీయ ప్రాధాన్యతను మెరుగుపరచడానికి 15 జిల్లాల్లో హెలిపోర్ట్‌లను నిర్మించే ప్రతిపాదనకు ప్రాధాన్యత కల్పించారు. ఢెంకనాల్ బిరాషోల్ ఎయిర్‌స్ట్రిప్ వద్ద బిజూ పట్నాయక్ ఏవియేషన్ సెంటర్ భవిష్యత్ అభివృద్ధి ప్రయత్నాలను వేగవంతం చేసేందుకు ప్రజా నిర్మాణ విభాగం నోడల్ ఏజెన్సీగా నియమించారు.

రౌర్కెలా విమానాశ్రయం అభివృద్ధి

రౌర్కెలా విమానాశ్రయం అభివృద్ధి ప్రణాళికలను ఈ సమావేశంలో ప్రస్తావించారు. రాష్ట్రంలో విమానయాన అనుసంధానం మరింత పెంపొందించేందుకు జయపురం, దండబోస్, రొంగైలుండా, గోటమా, సతిభట, రైసువాస్, తుషారా, జమదర్పాలి, మల్కన్‌గిరి, అమర్దా రోడ్ మరియు ఉత్కెలాతో సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన విమానాశ్రయాలపై దృష్టి సారించారు.

ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలపై దృష్టి

రాష్ట్ర వ్యాప్తంగా విమానాశ్రయాలు, హెలిపోర్ట్‌లు, డ్రోన్ హబ్‌లతో కూడిన ప్రపంచ స్థాయి విమానయాన సౌకర్యాలను ఏర్పాటు చేయాలనే నిబద్ధతను ముఖ్యమంత్రి మాఝీ పునరుద్ఘాటించారు. ఒడిశా విమానయాన రంగాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, మెరుగైన మానవ వనరుల ప్రతిపాదనలను చర్చించారు.

క్లుప్తంగా

సామూహిక ఉపనయనాలు



సామూహిక ఉపనయనంలో వైష్ణవులు

జయపురం: శైవ, వైష్ణవులకు జయపురం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం సామూహిక ఉపనయనాలు జరిగాయి. మొత్తం 116 మందికి ఉపనయనం చేశారు. శైవులకు బ్రహ్మశ్రీ గుండగోలు సూర్యప్రసాద శర్మ, వైష్ణవులకు శ్రీభాష్యం వేంకట రామానుజాచార్యులు, శ్రీమాన్ భాష్యం శ్రీనివాచార్యులు శ్రీకూర్మం వాస్తవ్యులు ఉపనయనం చేశారు. శని, ఆదివారాల్లోనూ ఈ క్రతువు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

దర్యాప్తునకు హక్కుల కమిషన్ తాఖీదు

భువనేశ్వర్: స్థానిక కిట్ విశ్వ విద్యాలయంలో నేపాలీ విద్యార్థిని మరణంపై దర్యాప్తు నిర్వహించి నివేదిక దాఖలు చేయాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఎన్‌హెచ్‌ఆర్‌సీ తాఖీదులు జారీ చేసింది. ఈ సంఘటనపై ఫిర్యాదులో చేసిన ఆరోపణలపై దర్యాప్తు జరిపి ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో సహా సరైన చర్యలు తీసుకోవాలని తాఖీదుల్లో పేర్కొంది. ఈ నెల 9వ తేదీ లోగా తీసుకున్న చర్యల నివేదిక (ఏటీఆర్)ను సమర్పించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి, రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్‌కు తాఖీదులు జారీ చేసింది.

చందన యాత్ర



మనద మోహనుని ఖొట్టొధోళి అలంకరణ

భువనేశ్వర్: శ్రీ క్షేత్రంలో చందన యాత్ర సందర్భంగా సంధ్య వేళలో బొడొ దండొ వీధుల్లో స్వామి ఊరేగింపుతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పవిత్ర వైశాఖ మాసం పంచమి తిథి పురస్కరించుకుని శుక్రవారం చందన యాత్రలో మూడో రోజున మదన మోహనుడు ప్రత్యేక శోభతో నౌకా విహారంలో పాల్గొనడం విశేషం. నరేంద్ర సరోవరం వేదికపై ఖొట్టొధోళి అలంకరణతో శోభిల్లాడు. కదంబ పుష్పాలతో అలంకరించిన డోళీలో ఊగిసలాడుతు చందన యాత్రని ఉత్సాహభరితం చేశాడు.

ఐపీఎస్ అధికారుల బదిలీ

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం స్వల్పంగా ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం సుశాంత కె నాథ్‌ను జైళ్ల శాఖ, కరెక్షనల్ సర్వీసెస్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. దయాల్ గంగ్వార్ అదనపు డైరెక్టర్ జనరల్, కమ్యూనికేషన్ మరియు ప్రతీక్ మహంతి అదనపు డైరెక్టర్ జనరల్ (ప్రధాన కార్యాలయం)గా నియమితులయ్యారు.

ఉగ్ర చర్యలను ఖండించాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉగ్రవాదం దేశ ప్రజల మనోధైర్యాన్ని దెబ్బతీస్తుందని, అభివృద్ధికి ఆటంకమని డాక్టర్ కె.సుధీర్ అన్నారు. శ్రీకాకుళంలో నగరంలో ప్రజావేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఏడురోడ్ల కూడలి నుంచి కోడి రామ్మూర్తి స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు, లాయర్లు, కవులు, రచయితలు, పెన్షనర్లు, జేసీస్, మానవతా, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘం, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ ఉగ్రవాదానికి మతం రంగు పులమకూడదన్నారు. విద్యావేత్తలు డాక్టర్ జామి భీమశంకరం, ప్రొఫెసర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ ఉగ్రవాదం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో కేతవరపు శ్రీనివాస్, బి.కృష్ణమూర్తి, ఎం.ప్రభాకరరావు, ఎస్.కిషోర్‌కుమార్, కె.నాగమణి, ఉషారాణి, ఆర్.మల్లేశ్వరరావు, జోగినాయుడు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. గురువారం రాత్రి వరకు మెయిన్‌రోడ్డులో తమ కుటుంబానికి చెందిన కూరగాయల షాపులో చలాకీగా ఉన్న ఆమె శుక్రవారం ఉదయానికి ఉరికి వేలాడుతూ విగతజీవిగా కనిపించడంతో స్థానికులు నిర్ఘాంతపోయారు. ఈమె భర్త ఉపాధి కోసం వలస వెళ్లడంతో ఇద్దరు కుమార్తెలతో కలిసి ఉంటోంది. ఆర్థిక వ్యవహారాలే మృతికి కారణమని తెలుస్తోంది. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో గురువారం అర్ధ రాత్రి వరకు ఇంట్లో ఘర్షణ చోటుచేసుకొందని, తర్వాత ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. మృతురాలు కన్నవారు కూడా కంచిలిలోనే ఉంటున్నారు. కాగా, పోలీసులకు సమాచారం ఇవ్వకుండా, భర్త రాకుండానే ఆదరాబాదరాగా అంత్యక్రియలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.

కిట్ విశ్వవిద్యాలయ విద్యార్థిని మరణం

- విదేశాంగ శాఖ సంతాపం
- యూజీసీ నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు
- క్యాంపస్ ప్రాంగణంలో పోలీసుల డేరా

భువనేశ్వర్:

స్థానిక కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కేఐఐటీ - కిట్) విశ్వవిద్యాలయ హాస్టళ్లలో నేపాల్‌కు చెందిన విద్యార్థినుల మరణాలు వరుసగా చోటు చేసుకోవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల ఈ విశ్వ విద్యాలయంలో నేపాలీ విద్యార్థి ప్రిషా షా మరణం అనుమానాస్పదమైంది. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా శుక్రవారం సాయంత్రం నుంచి క్యాంపస్‌లో పోలీసుల బృందం డేరా వేసింది. మరో వైపు ఈ విషాద సంఘటనపై విచారణ జరిపేందుకు పలు ప్రముఖ వర్గాలు ఎవరి తరహాలో వారు రంగంలోకి దిగారు. పోలీసు కమిషనర్, డిప్యూటీ పోలీసు కమిషనర్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఘటనా స్థలం సందర్శించారు. విద్యార్థిని విషాదకర మరణం పట్ల విదేశాంగ శాఖ విచారం వ్యక్తం చేసి సంతాపం ప్రకటించింది. ఈ క్లిష్ట సమయంలో మృతుల కుటుంబానికి సానుభూతిని తెలియజేసింది. ఈ విషయం వెలుగులోకి వచ్చినప్పటి నుండి ఒడిశా ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

రెండో నేపాలీ విద్యార్థి మరణం

ఈ క్యాంపస్‌లో నేపాలీ విద్యార్థి మృతి చెందడం వరుసగా ఇది రెండోసారి. మృతుల కుటుంబానికి ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతును ప్రకటించింది. ప్రస్తుతం ఒడిశా పోలీసులు సమగ్ర విచారణ నిర్వహిస్తున్నారని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారత ప్రభుత్వం అన్ని అంతర్జాతీయ విద్యార్థుల భద్రత, రక్షణ, శ్రేయస్సును తీవ్రంగా పరిగణిస్తుందని ఈ శాఖ పేర్కొంది. ఈ విషయంలో అనుక్షణం తాజా సమాచారం కోసం సమన్వయాన్ని నిర్ధారించడానికి నేపాలీ అధికారులు, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం, కిట్ నిర్వహణ యంత్రాంగంతో తాము సన్నిహితంగా ఉంటున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది.





క్యాంపస్‌లో పోలీసుల దేరా (ఇన్‌సెట్లో) మృత విద్యార్థిని

మరోవైపు ప్రిషా షా మరణంపై నేపాల్ రాయబార కార్యాలయం సంస్థ ప్రతినిధులు, పోలీసు అధికారులు మరియు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులతో పాటు సంబంధిత ఇతర పార్టీలను సంప్రదించి చర్చలు జరిపింది. నేపాల్ రాయబార కార్యాలయం కూడా ఈ సంఘటనపై స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తును డిమాండ్ చేసింది. కిట్ విశ్వ విద్యాలయంలో చదువుతున్న నేపాలీ విద్యార్థులందరి భద్రత, రక్షణను నిర్ధారించడం కీలకంగా పేర్కొంది. ఈ విషయానికి సంబంధించి నేపాల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ మరియు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి తాజా సమాచారం సేకరిస్తుంది.

కిట్ విశ్వవిద్యాలయం ప్రతిస్పందన

క్యాంపస్‌లో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని, ఈ సంఘటనపై కిట్ అధికారులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్యాంపస్‌లో ఈ సంఘటనను గుర్తించిన వెంటనే, హాస్టల్ అధికారు లు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వారి సమక్షంలోనే విద్యార్థి మృత దేహాన్ని స్వాధీ నం చేసుకున్నారు. ఆమెను వెంటనే కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. తదనంతరం తదుపరి ప్రక్రియ ల కోసం మృతదేహాన్ని ఎయిమ్స్ భువనేశ్వర్‌కు తరలించారు.

నిజ నిర్ధారణ కమిటి

ఈ సంఘటనపై యూజీసీ నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసింది. ఇగ్నో మాజీ వైస్ చాన్సలర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీలో చైర్మన్‌తో పాటు 3 మంది సభ్యులు ఉంటారు. క్యాంపస్‌లో ఇలాంటి సంఘటనలు ఏ పరిస్థితుల్లో జరుగుతున్నాయో కమిటీ నిజ నిర్ధారణ చేస్తుంది. దర్యాప్తు ముగించి కమిటీ 10 రోజుల్లో నివేదికను సమర్పిస్తుంది.

ఆవాస్ యోజనపై అవగాహన



ప్రసంగిస్తున్న అక్షయకుమార్

రాయగడ: పట్టణంలోని ప్రజలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-2.0 కార్యక్రమంపై శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ సమావేశం హాల్‌లో చైతన్య కార్యక్రమం జరిగింది. జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండొ ముఖ్యఅతిథిగా హాజరవ్వగా రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, వైస్ చైర్మన్ శుభ్రా పండలు పాల్గొన్నారు. రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ చైతన్య కార్యక్రమంలో భాగంగా అక్షయ్ కుమార్ మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతంలో నివసిస్తున్న అర్హులైన అందరికీ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో విలీనం చేసి వారు ఆ పథకం ద్వారా లబ్ధిపొందాలన్న ఉద్దేశ్యంతో ఈ చైతన్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. అందుకు మున్సిపాలిటీ పరిధిలో గల 24 వార్డుల్లో గల కౌన్సిలర్లు వారి వారి ప్రాంతాల్లో గల అర్హులైన వారిని పథకంలో చేర్పించేందుకు సహకరించాల్సి ఉంటుందని అన్నారు.

11 నుంచి సిమిలిగుడ అగ్ని గంగమ్మ పండగలు



వేదిక మీద ఎమ్మెల్యే రఘురాం ఇతర ప్రముఖులు

కొరాపుట్: సిమిలిగుడలో అగ్ని గంగమ్మ పండగలు 11వ తేదీ నుంచి జరపాలని ఉత్సవ కమిటీ నిర్ణయించింది. శుక్రవారం కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణంలోని అగ్ని గంగమ్మ దేవాలయ ప్రాంగణంలో తేదీ ఖరారు మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో సభ్యులందరూ సామూహికంగా మే 11 నుంచి 20వ తేదీ వరకు పండగలు నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో, మాజీ ఎమ్మెల్యే రఘురాం పొడాల్, సునాబెడా మున్సిపల్ చైర్మన్ రాజేంద్రకుమార్ పాత్రో, సునాబెడా ఎస్‌డీపీఓ సుమిత్ర జెన్న తదితరులు పాల్గొన్నారు.

కష్టార్జితం కాలిపోయింది..

- అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం
- కుమార్తె వివాహం కోసం దాచిన రూ.2.80 లక్షల నగదు బూడిద



కాలిపోయిన కరెన్సీ నోట్లు




కాలిపోయిన ఇంటి వద్ద బాధితరాలు పద్మావతి

కొత్తూరు: కష్టార్జితం కాలిపోయింది. కుమార్తె పెళ్లి కోసం దాచిపెట్టిన నగదు, బంగారం బూడిదైంది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రం కొత్తూరులోని కొత్తపేట కాలనీలో శుక్రువారం కొగాన పద్మావతి శుక్రవారం ఉదయం దేవుడి పటం వద్ద దీపం వెలిగించి ఉపాధి పనికి వెళ్లిపోయింది. ఇంతలో ఇంటి నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు గమనించి అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అనంతరం అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే పద్మావతి కుమార్తె వివాహం కోసం ఇనుప పెట్టిలో దాచిన రూ. 2.80 లక్షల నోట్లు కాలి బూడిదయ్యాయి. తులంన్నర బంగారం, పిల్లల విలువైన పత్రాలు, దుస్తులు, నిత్యావసర సరుకులు కాలిపోయాయి. సర్వం కోల్పోయిన పద్మావతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొత్తూరుకు చెందిన గోగుల చిట్టిబాబు బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

మసీదులో గంధంచెట్లు నరికివేత

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని సూర్యమహాల్ కూడలి పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న జామియా మసీదులో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు గంధం చెట్లు నరికి తరలించే యత్నం చేశారు. ఈ విషయమై ఇప్పటికే వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్‌కు మసీదు మౌజన్ (గురువు) ఎస్.కె.మహ్మద్ ఫిర్యాదు చేసినట్లు మత పెద్దలు కె.ఎస్.అమానుల్లా, మరికొందరు చెప్పారు. మసీదులో సుమారు 40 వరకు చిన్నవి, పెద్దవి గంధం చెట్లున్నాయని, శుక్రవారం ఉదయం చెట్లను వాచ్‌మెన్ నాయుడు దగ్గరుండి ట్రిమ్మింగ్ చేసినట్లు తెలిసిందన్నారు. సాయంత్రం 4 గంటలకు 30 అడుగుల పొడవుండే ఒక గంధం చెట్టును గుర్తు తెలియని వ్యక్తులు తరలించేశారని అదే వాచ్‌మెన్ మౌజన్‌కు చెప్పడంతో ఆయన ఫిర్యాదు చేశారు. ఇంకా లోపల ఎన్ని చెట్లు కొట్టేశారో తెలియాల్సి ఉందన్నారు.



గంధం చెట్టు కొమ్మ

గాయపడిన వ్యక్తి మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: కింతలి మిల్లు సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌పై వెళుతున్న బత్తిలి సత్యం (48) మార్చి 2న ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీ కొట్టడంతో గాయపడిన సంగతి తెలిసిందే. శ్రీకాకుళం రిమ్స్‌లో చేరి చికిత్స పొందుతుండగా.. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి స్వగ్రామం తోటపాలెం పంచాయతీ పెయిలవానిపేట. పోలీసులు కేసు నమోదు చేశారు.

స్తంభించిన ఆర్టీఏ సేవలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని తండేవలసలో ఉప రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం సేవలు స్తంభించాయి. గురువారం రాత్రి కురిసిన ఈదురుగాలులు, వర్షాలకు ఎక్కడికక్కడే విద్యుత్ వైర్లు, కేబుల్ వైర్లు తెగడంతో సేవలు నిలిచిపోయాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల ఆర్టీఏ సేవలు మొరాయించాయి. వివిధ పనుల కోసం వచ్చిన వాహనచోదకులకు నిరీక్షణ తప్పలేదు.

కిడ్నీ సమస్యతో ఇంటర్ విద్యార్థి మృతి

పొందూరు: మండలంలోని కేసవదాసుపురం గ్రామానికి చెందిన లింగాల కిషోర్(16) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ప్రస్తుతం ఎచ్చెర్లలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న కిషోర్ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో తల్లిదండ్రులు విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించగా రెండు కిడ్నీలు పూర్తిగా పాడైనట్లు గుర్తించారు. పేద కుటుంబం కావడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించలేక కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కిషోర్ పదో తరగతి లోలుగు హైస్కూల్లో చదివాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు సుజాత, రాజు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

రణస్థలం: జాతీయ రహదారిపై కారును లారీ ఢీకొట్టిన ఘటనలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 10.40 గంటల సమయంలో జె.ఆర్.పురం బస్‌స్టేషన్ సమీపంలో విశాఖపట్నం వైపు నుంచి వస్తున్న లారీ ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. లారీ డ్రైవర్ గమనించక 50 మీటర్ల వరకు కారును ఈడ్చుకెళ్లాడు. అదృష్టవశాత్తు కారులో ఉన్న నలుగురికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కారులో ఉన్న నలుగురు విశాఖపట్నం నుంచి జలుమూరు వెళుతున్నారు. ఘటనా స్థలాన్ని ఏఎస్సై ఉమామహేశ్వరరావు పరిశీలించి ట్రాఫిక్ చక్కదిద్దారు.

కంచిలిలో మాయం.. కోయంబత్తూరులో ప్రత్యక్షం

కాశీబుగ్గ: కంచిలి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మహిళ బొడ్డేపల్లి ధనలక్ష్మి ఐదు రోజుల కిందట అనుకోకుండా తమిళనాడు వెళ్లే రైలు ఎక్కింది. కోయంబత్తూరులో దిగడంతో అక్కడి స్థానికులు, పోలీసులు చేరదీశారు. ఇంతలో ఆన్‌లైన్ పోలీసింగ్ వారికి ఆమె ఆచూకీ మ్యాచ్ అవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు కోయంబత్తూరు వెళ్లి శుక్రవారం స్వగ్రామం కంచిలికి తీసుకువచ్చారు.

ఎన్‌బీడబ్ల్యూ అమలు చేయాలి

శ్రీకాకుళం క్రైమ్: నిందితులపై పెండింగ్ ఉన్న నాన్ బెయిల్‌బుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) త్వరితగతిన అమలు చేయాలనిఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ప్రాపర్టీ కేసుల్లో పెండింగ్ ఎన్‌బీడబ్ల్యూ అమలు, చైన్‌స్నాచింగ్, వాహనాల చోరీ, ఆలయాల్లో దొంగతనాలు తదితర నేరాలపై జూమ్ కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలపై దాడులు, ఎస్సీ, ఎస్టీ, పోక్సో వంటి కేసుల్లో ఎన్‌బీడబ్ల్యూ ఉంటే గుర్తించి వారి చిరునామా, ఇతర ఆధారాలను బట్టి కోర్టులో హాజరుపర్చాలని ఆదేశించారు. పాత నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని చెప్పారు.

పదో తరగతి ఫలితాలు విడుదల

- జిల్లా వ్యాప్తంగా 98.10 శాతం ఉత్తీర్ణత



జిల్లా ఫస్ట్‌ర్యాంకర్ ప్రజ్యోతి చౌదురి 566/600



ద్వితీయస్థానం సాధించిన సరస్వతీ శిశు విద్యామందిర్ విద్యార్థిని అంకితా పాఢి

పర్లాకిమిడి: పదో తరగతి పరీక్ష ఫలితాలను సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు శుక్రవారం ప్రకటించింది. గజపతి జిల్లాలో ఉత్తీర్ణత శాతం 98.10 ఉన్నట్టు జిల్లా ముఖ్యశిక్షాధికారి డాక్టర్ మాయాధర్ సాహు తెలిపారు. ఈసారి బాలికల కంటే బాలుర శాతం అధికంగా పాసయ్యారు. మొత్తం జిల్లాలో 110 ఉన్నత పాఠశాలల్లో పది పరీక్షలు ఫిబ్రవరిలో జరిగాయి. 7685 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా వారిలో 137 మంది గైర్హాజర్ అయ్యారు. ఏ1 (ఫస్టుక్లాస్) 15 మంది ఉత్తీర్ణత అవ్వగా, ఏ2లో 633, బి1లో 2254, బి2లో 2365, కంపార్ట్‌మెంటల్ 1331, డి గ్రేడ్ 745, ఈగ్రేడ్ 156, ఫెయిల్ 801 మంది ఉన్నారు. మొత్తంగా బాలికలు 20,647 మంది, బాలురు 20783 మంది పాసయ్యారు.


సరస్వతీ శిశు విద్యామందిర్ పాఠశాలలో జిల్లా వ్యాప్తంగా ఏ1 గ్రేడ్‌ను (90శాతం) 566/600 ప్రజ్యోతి చౌదురి, అంకితా పాఢి 600మార్కులుకు గాను 553 సాధించింది. సరస్వతీశిశు విద్యామందిర్‌లో శతశాతం పాసయ్యినట్టు ప్రధాన అచార్యులు సరోజ్ పండా తెలియజేశారు.

జయపురంలో 100 శాతం ఫలితాలు

జయపురం: రాష్ట్రంలో మెట్రిక్ పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. కొరాపుట్ జిల్లాలో 92 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా తెలుగు సంస్కృతిక సమితిచే నిర్వహించబడుతున్న జయపురం సిటీ ఉన్నత పాఠశాలలో 100 శాతం ఫలితాలు సాధించింది. ఈ పాఠశాల నుంచి 75 మంది మెట్రిక్ పరీక్షలు రాయగా వారంతా ఉత్తీర్ణులు అయ్యారు. వారిలో ఏ-2 గ్రేడ్‌లో ఒకరు ఉత్తీర్ణ కాగా బి.1 గ్రేడ్‌లో 11 మంది,బి.2 గ్రేడ్‌లో 23 మంది.సి.గ్రేడ్‌లో 32 మంది. డి గ్రేడ్‌లో 6 గురు, ఇ. గ్రేడ్‌లో ఇద్దరు ఉత్తీర్ణులైనట్టు పాఠశాల వర్గాలు వెల్లడించాయి.

దిఘా జగన్నాథ ఆలయ వివాదం తీవ్రతరం

- అంతర్గత దర్యాప్తునకు ఆదేశాలు



దిఘా జగన్నాథ ఆలయం

భువనేశ్వర్: పశ్చిమబెంగాల్‌లోని దిఘా ప్రాంతంలో జగన్నాథ ఆలయం ప్రతిష్ట మహోత్సవం వివాదస్పదమై తీవ్ర కలకలం రేపుతోంది. ఈ పరిస్థితిపై రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ స్పందించారు. ఈ వివాదం కోణంలో అంతర్గత దర్యాప్తు జరపాలని పూరీ శ్రీజగన్నాథ ఆలయ ప్రధాన పాలన అధికారి(సీఏఓ) డాక్టర్ అరవింద్ కుమార్ పాఢికి మంత్రి లేఖ రాశారు. ఈ లేఖలో దర్యాప్తు జరపాల్సిన సమస్యాత్మక అంశాల్ని స్పష్టం చేశారు. దిఘా ఆలయానికి జగన్నాథ ధామ్ అని పేరు పెట్టడం అత్యంత వివాదస్పదం అయింది. దేశంలో సమగ్రంగా చతుర్థామాలు ఉన్నాయి. వీటిలో పూరీ ఒకటిగా స్థానం సాధించింది. ఈ పరిస్థితుల్లో దిఘా జగన్నాథ ఆలయాన్ని జగన్నాథ ధామ్‌గా పేర్కొనడంతో రచ్చ రగులుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో పూరీ శ్రీమందిరం నుంచి సేవాయత్‌లు దిఘా ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనడం వివాదాన్ని మరింత రగిల్చింది. మరో వైపు దిఘా ఆలయంలో దేవతల విగ్రహాలను నిర్మించడానికి శ్రీమందిరంలో దారు విగ్రహాల తయారీ తర్వాత మిగిలిన పవిత్ర కలప ఉపయోగించినట్లు ప్రసారమైన వార్తలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. దిఘా జగన్నాథ ఆలయాన్ని ఏప్రిల్ 30న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రారంభించారు. ఈ చర్యలు జగన్నాథ స్వామి భక్తులు మరియు ఒడిశాలోని నాలుగున్నర కోట్ల మంది రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీశాయని మంత్రి విచారం వ్యక్తం చేశారు. వివాదస్పద అంశాల్ని పరిగణనలోకి తీసుకుని అంతర్గత దర్యాప్తు చేపట్టి వాస్తవాస్తవాల్ని వెలుగులోకి తీసుకు రావాల్సి ఉందని మంత్రి శ్రీమందిరం సీఏఓకి రాసిన లేఖలో స్పష్టం చేశారు. దర్యాప్తులో ఎవరైనా దోషులుగా తేలితే శిక్ష పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

జగన్నాథ్ ధామ్ అంటే పూరీ మాత్రమే

- రామకృష్ణ దాస్ మహాపాత్రో



భువనేశ్వర్: పశ్చిమ బెంగాలు దిఘా ప్రాంతంలో జగన్నాథ ఆలయం ప్రారంభోత్సవం వివాదాస్పదం అయింది. ఈ ఆలయాన్ని జగన్నాథ ధామ్‌గా పేర్కొనడం, ఆలయంలో రాతి విగ్రహాలు చర్చనీయాంశం అయ్యాయి. ఇటువంటి వివాదస్పద జగన్నాథ ఆలయ ప్రతిష్ట మహోత్సవానికి శ్రీ మందిరం నుంచి స్వామి సేవాయత్‌ల బృందం హాజరు కావడం రచ్చ ప్రేరేపించింది. ఈ పరిస్థితిపై దైతపతి నియోగుల సంఘం కార్యదర్శి రామకృష్ణ దాస్ మహాపాత్రో శుక్రవారం స్పందించారు. పూరీలో ప్రసిద్ధ జగన్నాథ ఆలయం శ్రీమందిరంలో మినహా మరెక్కడా దారు బ్రహ్మ లేడని పేర్కొన్నారు. అలాగే జగన్నాథ్ ధామ్ అంటే పూరీని మాత్రమే సూచిస్తుందన్నారు. మరెక్కడా జగన్నాథ్ ధామ్ ఉండదని తేల్చేశారు. ఈ మేరకు అధికారిక స్థాయిలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఆమెకి లేఖ రాసి ఈ విషయం తెలియజేస్తానని స్పష్టం చేశారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లోని దిఘాలో కొత్తగా ప్రారంభించబడిన జగన్నాథ ఆలయానికి ఆహ్వానం అందిన తర్వాత తాను హాజరైనట్లు వెల్లడించారు. అక్కడ విగ్రహాల ఎత్తు రెండున్నర అడుగుల నుంచి మూడు అడుగుల మధ్య ఉందన్నారు. మమతా బెనర్జీ తన శిష్యులలో ఒకరుగా పేర్కొన్నారు. ఆమె తనను దిఘాలో జగన్నాథ ఆలయాన్ని స్థాపించమని ఆహ్వానించింది. తిథి ప్రకారం పూజ చేయమని కోరింది. అక్కడ 3 నెలలు రాతి విగ్రహాలు ఉన్నాయి. అయితే ప్రతిష్ఠించబడిన విగ్రహాలు వేప చెక్కతో తయారు చేయబడినవని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని దిఘాలో జగన్నాథ ఆలయ స్థాపన మరియు దానికి జగన్నాథ్ ధామ్ అని పేరు పెట్టడంపై చెలరేగిన వివాదంపట్ల సేవకులలో మిశ్రమ స్పందనలు కలకలం రేపుతున్నాయి.



● తీరం నుంచి సముద్రంలోకి..

ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ అందరి బాధ్యతని అటవీశాఖ సెక్షన్ అధికారి ఆర్.రాఘవయ్య అన్నారు. కవిటి మండలం కపాసుకుద్దిలో శుక్రవారం ప్రభుత్వం అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన సముద్ర తాబేలు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. 560 ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను సురక్షితంగా సముద్రంలోకి వదిలారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రవికుమార్, రక్షణ దళ సభ్యులు వల్లభరావు ధర్మరాజు కుమార్ స్వామి, కోడా దేవరాజు తదితరులు పాల్గొన్నారు. - కవిటి

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి



ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పలాస : కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను ఆపి వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని సి.పి.ఐ. ఎం.ఎల్ న్యూడెమొక్రసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు వివిధ ప్రజా సంఘాలతో కలిసి శుక్రవారం పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు దండకారణ్యంలో ఆదివాసీలు సుమారు 400 మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టు పార్టీ నాయకులను, కార్యకర్తలను భౌతికంగా నిర్మూలించే కార్యక్రమం చేపట్టడం అప్రజాస్వామ్యమన్నారు. కర్రెగుట్ట కొండలను జల్లెడ పడుతున్నారని, అన్నిరకాల భద్రతా బలగాలను ఈ ఆపరేషన్‌కు వినియోగించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, చాపర వేణు, కొర్రాయి నీలకంఠం, పోతనపల్లి అరుణ, లక్ష్మణరావు, పుచ్చ దుర్యోధనరావు, మద్దిల రామారావు, ఎం.వినోద్, గొరకల బాలకృష్ణ, వంకల పాపయ్య, మామిడి భీమారావు, రాపాక మాధవరావు, జడ్డే అప్పయ్య, పోతనపల్లి కుసుమ, బర్ల గోపి, ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరు


మాట్లాడుతున్న ఈఈ రమణమూర్తి

బొబ్బిలి: పంచాయతీరాజ్ డివిజన్ పరిధిలో మూడు నియోజకవర్గాల రహదారుల మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ రాజ్ ఈఈ టీవీ రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ బొబ్బిలి నియోజకవర్గంలో 2, రాజాంలో 2, గజపతినగరంలో 3 రహదారుల మరమ్మతులు చేసేందుకు నాబార్డ్ నిధులు రూ.12.87 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ రహదారులకు సంబంధించి త్వరలోనే ఆన్‌లైన్ టెండర్లు పిలవనున్నట్లు చెప్పారు. అలాగే మూడు నియోజకవర్గాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.109 కోట్లతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. ఈ పనుల్లో ఇప్పటికే రూ.60 కోట్ల విలువైన 1046 పనులు పూర్తయ్యాయని, వాటికి రూ.10 కోట్ల బిల్లుల చెల్లింపులు పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు టీఎల్ఎం కిట్లు


టీఎల్ఎం కిట్లు అందిస్తున్న ఇన్‌చార్జ్ డీఈఓ రమాజ్యోతి


పార్వతీపురం: ప్రత్యేక అవసరాల పిల్లలకు టీఎల్ఎం కిట్లను సెంటర్ ఫర్ రిహ్యాబిలిటేషన్ కౌన్సిల్, నెల్లూరు సంస్థ అందించినట్లు ఇన్‌చార్జ్ జిల్లా విద్యాశాఖాధికారి డి.రమాజ్యోతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్యేక అవసరాల కేంద్రంలో ఇంటలెక్చువల్ డిజేబులిటి (మేధో వైకల్యం) కేటరిగిలో 13మంది ఎస్టీ కమ్యూనిటీకి చెందిన ప్రత్యేక అవసరాల పిల్లలకు రూ.1.30లక్షల విలువచేసే టీఎల్ఎం కిట్లను ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆమె అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు అవసరమైన కిట్లు అందించేందుకు నెల్లూరులోని స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. టీఎల్ఎం కిట్లును సద్వినియోగం చేసుకునేలా ఐఈఆర్‌పీలు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీసీ రెడ్డి తేజేశ్వరరావు, సెక్టోరియల్ అధికారి మధుకిషోర్, జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ భానుమూర్తి, ఐఈఆర్‌పీలు పాల్గొన్నారు.

సారాతో ఇద్దరి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న సారాను చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం ప్రొహిబిషన్/ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని జియ్యమ్మవలస మండలం చినమేరంగి గ్రామం వద్ద సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి అరెస్ట్ చేసి వారి నుంచి 22 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. అక్రమంగా సారా అమ్మకాలను నిరోధించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తమ సిబ్బంది దాడులు నిర్వహించారని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా సారా తయారీ, రవాణా, అమ్మకాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటువంటి సంఘటనలు గ్రామాల్లో జరిగినట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచనున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై ఆర్.చంద్రకాంత్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఐరన్ సుక్రోజ్ వ్యాక్సిన్లతో రక్తహీనత నివారణ


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: రక్తహీనతతో బాధపడే గర్భిణులకు పీహెచ్‌సీల్లో ఐరన్ సుక్రోజ్ వ్యాక్సిన్ వేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నవంబర్ 2024 నుంచి మార్చి 2025 మధ్య జరిగిన నాలుగు మాతృ మరణాలు, 15 శిశు మరణాలకు కారణాలపై ఆరా తీశారు. భవిష్యత్తులో మాతృ, శిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలతో పాటు ఐరన్ సమృద్ధిగా ఉన్న ఆహార పదార్థాలు ప్రతిరోజు తినేలా చూడాలన్నారు. హైరిస్క్ గర్భిణులను ప్రసవ తేదీకి ముందే ఆస్పత్రులో చేర్పించాలని సూచించారు. సమావేశంలో డీఐఓ అచ్చుతకుమారి, డీసీహెచ్ఎస్ ఎన్.పి.పద్మశ్రీరాణి, జీవీకే సత్యనారాయణ, ఆర్.సుజాత, కిశోర్‌కుమార్, అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీఓ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బకు రా..బెట్టింగ్ ముఠా..!

- ఐపీఎల్ బెట్టింగ్ యాప్ గుట్టురట్టు
- 11మంది నిందితుల అరెస్ట్
- విలేకరుల ముందు ప్రవేశపెట్టిన ఎస్పీ
- రూ 14లక్షల నగదు, ల్యాప్‌టాప్, 13మొబైల్స్ సీజ్


నిందితులను అరెస్ట్ చేసిన బొబ్బిలి పోలీసులు, చిత్రంలో ఎస్పీ వకుల్ జిందల్, బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐలు సతీష్

విజయనగరం క్రైమ్: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల ద్వారా లక్షల రూపాయల సొమ్ము అక్రమంగా సంపాదిస్తున్న ముఠా గుట్టును బొబ్బిలి పోలీసులు రట్టు చేశారు. ఈ మేరకు విజయనగరం ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం విలేకరుల ముందు నిందితులను ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డితో కలిసి ఎస్పీ వకుల్‌జిందల్ మాట్లాడారు. బొబ్బిలి పోలీస్ సబ్ డివిజన్ పరిధి బొబ్బిలి పీఎస్ పరిధి శివరాంపురం మామిడి తోటలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా ముఠా గుట్టురట్టయిందని ఎస్పీ తెలిపారు. పార్వతీపురం-మన్యం జిల్లాకు చెందిన ముషిడిపల్లి దివాకర్ ప్రధాన నిందితుడిగా బెట్టింగ్‌ల్లో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బెంగళూరుకు చెందిన నిరంజన్‌రెడ్డితో ఎంఓయూ కుదుర్చుకున్నాడు. రాధే ఎక్స్చేంజ్ అనే బెట్టింగ్ యాప్‌ను తీసుకుని అడ్మిన్‌గా ఉంటూ దాదాపు 200 మంది యువకులను ఈ యాప్‌ల ద్వారా ఆకర్షించాడు. కమీషన్ ఆశ చూపి యువతను నకిలీ బెట్టింగ్‌యాప్‌ల వలలో చేరుస్తున్నాడు. ఏజెంట్లుగా నియమించిన యువతతో బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేయిస్తూ కమీషన్ ఎరచూపి వాట్సాప్ లింకులు షేర్ చేస్తూ డబ్బులు సంపాదించేవాడని ఎస్పీ తెలిపారు. బెట్టింగ్ యాప్‌లను మరింతగా విస్తృతం చేయాలనే ఉద్దేశంతో పార్వతీపురం-మన్యం జిల్లాకు చెందిన నవీన్, సంతోష్‌లతో కలిసి నేషనల్ ఎక్స్చేంజ్ అనే మరో బెట్టింగ్ యాప్‌కు అడ్మిన్ అయి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువతను ఆకర్షించి డబ్బులు సంపాదించడం లక్ష్యంగా పెట్టుకునే వారని విచారణలో వెల్లడైందన్నారు. ఇలా బెట్టింగ్‌లకు పాల్పడుతున్న 11 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ చెప్పారు. అలాగే నిందితుల దగ్గర నుంచి రూ 14లక్షల నగదు, ల్యాప్‌టాప్, 13మొబైల్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

పరారీలో నలుగురు నిందితులు

అయితే పరారీలో ఉన్న మరో నలుగురు అడ్మిన్‌లైన నిరంజన్‌రెడ్డి, సంతోష్ , కార్తీక్, నవీన్‌ల కోసం గాలిస్తున్నామన్నారు. ప్రధాన నిందితుడైన ముషిడిపల్లి దివాకర్ ఏజెంట్లకు 3 శాతం కమీషన్ ఇవ్వడంతో పాటు పోగొట్టుకున్న వ్యక్తుల నగదులో 50 శాతం సొమ్మును ఏజెంట్లకు ఇచ్చి వారిని బెట్టింగ్ యాప్ ప్రమోట్ చేసేందుకు ప్రోత్సహించేవాడని ఎస్పీ వకుల్‌జిందల్ తెలిపారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల ద్వారా డబ్బులు సంపాదించడం చట్ట వ్యతిరేకమని, జీవితాలు నాశనం చేసే బెట్టింగ్‌ల జోలికి ఎవరూ పోవద్దని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు.

సిబ్బందికి అభినందనలు

క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు చేయడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన బొబ్బిలి సీఐ సతీష్, ఎస్ఐ రమేష్, పీసీలు సత్యనారాయణ, సతీష్ కుమార్, ఎర్రంనాయుడు, అప్పారావులను ఎస్పీ అభినందించారు.

మహిళల సంరక్షణపై డేగకన్ను


వీడియా కాన్ఫరెన్స్ హాలు నుంచి మహిళా పోలీస్ వెబ్‌సైట్‌ను లాంచ్ చేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

- క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్

విజయనగరం క్రైమ్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళల కోసం, వారి సంరక్షణ కోసం ప్రత్యేకంగా తీసుకొచ్చిన మహిళా సంరక్షణ పోలీస్‌వింగ్‌ను కూటమి ప్రభుత్వం కాస్త మార్పులు చేసింది. వారి విధులను పర్యవేక్షించడానికి ప్రత్యేకించి ఓ వెబ్‌సైట్‌ను రూపొందించింది. ఈ మేరకు ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం వీసీ హాలులో వెబ్ సైట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. దీంతో పాటు వాల్ పోస్టర్‌ను తన చాంబర్‌లో ఆవిష్కరించారు. తొలిసారిగా విజయనగరం జిల్లాలో మహిళల కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ను ప్రప్రథమంగా లాంచ్ చేశామని చెప్పారు. క్షేత్రస్థాయిలో మహిళా పోలీసులు నిర్వర్తించే విధులు, సీసీ కెమెరాల ఏర్పాటు, నేరాల నియంత్రణ, శక్తి యాప్ డౌన్‌లోడ్, ఫ్యామిలీ కౌన్సెలింగ్, బాల్య వివాహాలు, అసాంఘిక కార్యక్రమాలు వంటి సమాచారాన్ని తెలియపరచడంతో పాటు చైతన్యం కలిగించే అంశాలను సదరు వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నామన్నారు. ప్రధానంగా ఈ పనికి మహిళా పోలీసులను గుర్తించి సమర్థవంతంగా పని చేసేవారికి ఇచ్చిన లక్ష్యాలను బేరీజు వేసుకుని వారికి ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. నెలాఖరున నిర్వహించిన విధులు, సాధించిన లక్ష్యాల ఆధారంగా ఐదుగురిని జిల్లా కేంద్రానికి పిలిచి అభినందించి ప్రోత్సాహకాలు ఇస్తామని ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐలు లీలారావు, చౌదరి, కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

గౌహతి ఐఐటీలో పీహెచ్‌డీ


అసిస్టెంట్ ప్రొఫెసర్ రవి

సీతంపేట: మండలంలోని పెద్దపల్లంకి గ్రామానికి చెందిన ప్రొఫెసర్ గేదెల రవి ఐఐటీ గౌహతి బయో సైన్సెస్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం యూనివర్సిటీ ప్రకటించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం శ్రీకాకుళంలోని ఆర్‌జీయూకేటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఆయన పనిచేస్తున్నారు. 2016లో గౌహతి ఐఐటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ తీసుకున్నారు. పీహెచ్‌డీ లభించడం పట్ల సహచర ప్రొఫెసర్లు, గ్రామస్తులు, కుటుంబసభ్యులు ఆయనను అభినందించారు.

సమస్యల పరిష్కారం, సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి


సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: పోలీసుశాఖలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నుంచి విజ్ఞాపనలు స్వీకరించి, సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, పరిష్కారానికి చర్యలు చేపడతామని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తన కార్యాలయంలో 'పోలీస్ వెల్ఫేర్ డే' (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ముఖ్య ప్రాధాన్యం ఇస్తూ సిబ్బంది వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగత సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్-డేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొని వారి సమస్యలను తనకు నేరుగా తెలియజేయాలని ఎస్పీ కోరారు. వచ్చిన సమస్యలను కూలంకుషంగా విని, విన్నపాలను పరిశీలించి సత్వర పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీసీ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీకి గడువు పెంపు

- జూన్ 30వరకు సమయం
- లబ్ధిదారులకు తీరిన టెన్షన్


ఈకేవైసీ చేయించుకుంటున్న లబ్ధిదారులు

పార్వతీపురం: ఈకేవైసీ గడువు మళ్లీ పొడిగించారు. దీంతో పేదలకు టెన్షన్ తీరింది. ఏప్రిల్ 30వరకు ఈకేవైసీకి గడువు విధించడంతో రానున్న నెలల్లో రేషన్ నిలిచిపోతుందని పలువురు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈకేవైసీ చేయించుకునేందుకు జూన్ 30వరకు గడువును పొడిగించింది. దీంతో కార్డుదారులు కొంతమేర ఊపిరిపీల్చుకున్నారు. ఇంతవరకు పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా 38వేలమంది వరకు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట

రేషన్ పంపిణీలో అక్రమాల కారణంగా చౌకదుకాణాల్లో బియ్యం పక్కదారి పట్టి దుర్వినియోగం కాకుండా చేయాలనే ఉద్దేశంతో రేషన్‌కార్డుల్లోని సభ్యులంతా ఈకేవైసీ చేయించుకుని అర్హులైన వారికి మాత్రమే సబ్సిడీ బియ్యం అందేలా చర్యలు చేపడుతున్న తరుణంలో రేషన్‌కార్డులో లబ్ధిదారులంతా ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలోని 15 మండలాల్లో 2,77, 153 రేషన్ కార్డులుండగా అందులో 8,23,638 మంది సభ్యులున్నారు. ఇంతవరకు 7.80లక్షమందివరకు ఈకే వైసీ చేయించుకోగా మిగిలినవారు చేయించుకోవాల్సి ఉంది. ఈకేవైసీ చేయించుకునేందుకు ఇంతవరకు రెండుసార్లు గడువును విధించి పొడిగిస్తున్నారు. తాజాగా జూన్ 30వరకు గడువు విధించారు.

ఇతర ప్రాంతాల్లో స్థిరపడడం వల్ల

బతుకు తెరువుకోసం యువకులు, వ్యవసాయ కూలీలు హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై, బెంగుళూరు తదితర ప్రాంతాలకు వలసవెళ్లారు. పండగలు, శుభకార్యాలకు, సొంత గ్రామాలకు వచ్చి తమ రేషన్ కార్డులో పేర్లను కొనసాగిస్తుంటారు. ముఖ్యంగా సంక్షేమ పథకాలకు దూరం అవకూడదనే ఉద్దేశంతో రేషన్‌కార్డులను వినియోగిస్తూ ఆయాప్రాంతాల్లో రేషన్ సరుకులు తీసుకుంటున్నారు. విద్యాభ్యాసం కోసం ఇతర పట్టణాలకు, ప్రాంతాలకు వెళ్లిన విద్యార్థుల విషయంలోను, వృద్ధులకు వేలిముద్రలు పడని కారణంగా ఈకేవైసీ సమస్య తలెత్తుతోందని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే సంక్షేమ పథకాలు దూరమవుతామని సర్వత్రా ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు కూడా ఈకేవైసీ చేయించాలని ఆదేశించడంతో వారి వేలిముద్రలు పడకపోవడంతో ఆధార్‌కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

జూన్ నెలాఖరు లోగా చేయించుకోవాలి

రేషన్ కార్డుల్లో కుటుంబసభ్యులందరూ ఈకేవైసీ చేయించుకోవాలి. ఈకేవైసీ చేయించుకునేందుకు జూన్ నెలాఖరువరకు గడువును పొడిగించారు. ఇంకా చేయించుకోని లబ్ధిదారులందరికీ ఈకేవైసీ చేసేలా సిబ్బందిని ఆదేశించాం. లబ్ధిదారులంతా సమీపంలోని చౌకదుకాణాలు, మీసేవా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ చేయిచుకోవాలి.

ఐ.రాజేశ్వరి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, పార్వతీపురం మన్యం జిల్లా

వడదెబ్బతో ఉపాధి వేతనదారు మృతి


రామారావు మృతదేహం

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారు గేదెల రామారావు (60) వడదెబ్బకు గురై మృతి చెందాడు. ఎప్పటి లాగా శుక్రవారం కూడా గ్రామంలోని డెంకాడ చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనికి వెళ్లాడు. ఉదయం 9.30 గంటల సమయంలో సొమ్మసిల్లి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో తోటి వేతనదారులు చికిత్స కోసం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకుని వెళ్లిపోయారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు..

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో విద్యుత్ షాక్ తగిలి కురుపాం మండలం నీలకంఠాపురం పంచాయతీ డంగులగూడ గ్రామానికి చెందిన బిడ్డిక ప్రశాంత్(23) మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ప్రశాంత్ గోపాలపురంలోని ఓ రొయ్యిల చెరువులో కొన్నేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే శుక్రవారం చెరువులోని పనికి వెళ్లగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడంటూ..ఫోన్ ద్వారా రొయ్యిల చెరువులో పనిచేస్తున్న సహచర కూలీలు, రొయ్యల చెరువు యజమాని సమాచారం ఇచ్చారని కుటుంబసభ్యులు తెలియజేశారు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు వెంటనే గోపాలపురం పయనమయ్యారు.

లారీ ఢీకొని వ్యక్తి..


మృతుడు సత్యం (ఫైల్)

సీతానగరం: మండలంలోని తామరఖండి గ్రామంలో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీ వద్ద శుక్రవారం లారీ ఢీకొట్టడంతో ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనపై స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం, పెదకాద గ్రామానికి చెందిన గంగవరపు సత్యం (50)సీతానగరం కుమ్మరివీధిలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. కుటుంబసభ్యులు, సమీప బంధువుల ఆధ్వర్యంలో తామరఖండిలో నిర్వహిస్తున్న ఇటుకబట్టీలో పనిచేస్తున్నాడు. ఒడిశా నుంచి యాష్ లారీ ఇటుకల బట్టీలో అన్‌లోడ్ చేయడానికి వచ్చింది. అన్‌లోడ్ చేయడానికి ఇటుకబట్టీని ఆనుకుని లారీ వెనక్కి మళ్లిస్తుండగా మధ్యలో ఉన్న గంగవరపు సత్యం ఇరుక్కుపోవడంతో ప్రమాదం జరిగి గాయాలపాలు కాగా చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న ఏఎస్సై శ్రీనివాసరావు పరిశీలించి కేసునమోదు చేసినట్లు తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామన్నారు.

150 గజాల వరకు ఉచిత రిజిస్ట్రేషన్

నెల్లిమర్ల : అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా 150 చదరపు గజాల వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తహసీల్దార్ బి.సుదర్శనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రెవెన్యూ, శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. 151 నుంచి 300 గజాల వరకు రిజిస్ట్రేషన్ బేసిక్ విలువలో 15 శాతం , రిజిస్ట్రేషన్ ఫీజులో 50శాతం చెల్లించాలని అన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి మాత్రమే ఇది వర్తిస్తుందని వెల్లడించారు.

ప్రకృతి వైపరీత్యాలతో ఆందోళన చెందవద్దు

- జాగ్రత్తలు పాటిస్తే ముప్పు నుంచి తప్పించుకోవచ్చు
- అవగాహన కల్పించిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు


ప్రకృతి వైపరీత్యాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం


గ్యాస్‌లీక్‌పై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

మక్కువ: ప్రకృతి వైపరీత్యాలు సంభవించేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు పాటిస్తే ఆ ముప్పు నుంచి తప్పించుకోవచ్చని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ప్రజలకు అవగాహన కల్పించాయి. ఈ మేరకు మక్కువ మండలంలోని వెంకట భైరిపురం జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం ప్రకృతి వైపరీత్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విపత్తు నిర్వహణ బృందం సభ్యులు ప్రకృతి వైపరీత్యాల్లో ఏ రకమైన జాగ్రత్తలు పాటించాలి, ముందస్తు చర్యలు ఏ విధంగా తీసుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. వెంకటభైరిపురం గ్రామం సమీపంలో కొత్తవలస ఆనకట్టపై వరద ఉధృతి వచ్చేటప్పుడు, ఏ విధమైన చర్యలు చేపట్టాలో ఆనకట్టు నీటిలో ప్రాక్టికల్స్ నిర్వహించారు. వెంకట భైరిపురం హైస్కూల్‌లో ఫైర్ బ్రిగేడియర్ ఆపరేషన్‌పై, భూకంపాలు వచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, అకస్మికంగా గ్యాస్ లీక్ అయితే, ఏ విధంగా మంటలను అదుపు చేయాలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ, వైద్యశాఖ, పోలీస్, పంచాయతీరాజ్, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.


మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్‌మోహన్

బర్త్ సర్టిఫికెట్ల దరఖాస్తుల స్వీకరణలో అలసత్వం వద్దు

- నరేగా పనుల్లో మరింత ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి
- హౌసింగ్‌పై మండల ప్రత్యేకాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి
- జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక

పార్వతీపురం టౌన్: జిల్లాలో 6 ఏళ్ల లోపు వయసు గల పిల్లలకు జారీచేయనున్న బర్త్ సర్టిఫికెట్లకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణలో అలసత్వం వద్దని జాయింట్ కలెక్టర్ మండల అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాటికి దరఖాస్తుల స్వీకరణ పూర్తిచేయాల్సి ఉన్నప్పటికీ సీతంపేట, బలిజిపేట, భామిని, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, పాలకొండ, పార్వతీపురం, సాలూరు అర్బన్ ప్రాంతాల్లో ఇప్పటివరకు దరఖాస్తులు స్వీకరించక పోవడంపై ఆమె ఆరా తీశారు. శనివారం ఉదయానికి ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయాలని, లేదంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బర్త్ సర్టిఫికెట్లు మంజూరైతే, ఈ నెలాఖరులోగా పిల్లలకు ఆధార్ కార్డులు వస్తాయని, కావున దీనిపై అధికారులు ప్రత్యేక దష్టి సారించాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నరేగా పనుల్లో కూడా అధికారులు మరింత ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో సగటు దినసరి వేతనం రూ.300లు ఉండేలా అధికారులు చొరవ చూపాలని చెప్పారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఫారంపాండ్ల ఏర్పాటుకు అనువుగా ఉంటుందని, కావున దీనిపై దృష్టి సారించి ప్రతి గ్రూపు కనీసం ఐదు ఫారంపాండ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంజినీరింగ్ అధికారులు చొరవ చూపాలి

జిల్లాలో చేపడుతున్న గృహనిర్మాణాల్లో ఇంజినీరింగ్ అధికారులు చొరవ చూపేలా మండల ప్రత్యేకాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జేసీ ఆదేశించారు. ప్రతి మండలంలో ప్రతిరోజూ గృహ నిర్మాణాల ప్రగతి ఉండాలని, లేదంటే చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. వివిధ స్థాయిల్లో ఉండే గృహ నిర్మాణాల్లో ముందుగా తుది దశకు చేరుకున్న గృహాలపై ప్రత్యేక దృష్టిని సారించి వాటిని పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. వివిధ పథకాల గృహాలతో పాటు ముఖ్యంగా పీఎం జన్‌మన్ పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జేసీ స్పష్టం చేశారు.

పీజీఆర్ఎస్ త్వరితగతిన పరిష్కారం కావాలి

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందే దరఖాస్తులను జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని జేసీ అన్నారు. సోమవారం రోజున వచ్చే దరఖాస్తులన్నీ వచ్చే సోమవారానికి ఏ ఒక్కటీ పెండింగ్ లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, గృహ నిర్మాణ సంస్థ, డీఆర్డీఏ, డ్వామా, పీడీలు డా.పి.ధర్మచంద్రారెడ్డి, ఎం.సుధారాణి, కె.రామచంద్రరావు, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, పంచాయతీ అధికారులు కె.రాబర్ట్‌పాల్, బి.శ్యామల, డా.ఎస్.మన్మథరావు, టి.కొండలరావు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పంచాయతీ సెక్రటరీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: ఉద్యోగావకాశాలు లభించే సాఫ్ట్‌వేర్ డెవలపర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుల శిక్షణ కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వీటీఅగ్రహారం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ టీవీ గిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చే ఈ కోర్సులకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ ఆపై చదువుకున్న వారంతా అర్హులేనని, 35 ఏళ్ల వయసులోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోపు క్యూఆర్ కోడ్ ద్వారా పేర్లను నమోదు చేసుకొని ఆధార్ కార్డు, 2 ఫొటోలతో నేరుగా స్థానిక ఐటీఐ కళాశాలకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాల కోసం 7780658035 నంబరును సంప్రదించాలని సూచించారు.

ఎంజేపీఏపీ సెట్‌కు 599 దరఖాస్తులు

- 4న ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష
- గురుకులాల జిల్లా కన్వీనర్ డాక్టర్ కేబీబీ రావు

నెల్లిమర్ల: జిల్లాలో ఎంజేపీఏపీ సెట్‌కు 599 దరఖాస్తులు అందినట్లు మహాత్మా జ్యోతిబాఫూలే బీసీ సంక్షేమ గురుకులాల జిల్లా కన్వీనర్ డాక్టర్ కేబీబీ రావు శుక్రవారం తెలిపారు. విద్యార్థులకు ఈ నెల 4న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం నెల్లిమర్ల, గజపతినగరంలోని తమ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆ రోజు ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా నెల్లిమర్ల బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సీట్లు భర్తీ చేస్తామన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయని తెలిపారు.